


అది నా కోసం నేను చేయవలసి వచ్చిన పనిగాదు. నా చుట్టూ వున్న జనం కోసం నెరవేర్చ వలసిన కర్తవ్యం. వీలయినంత చిత్తశుద్ధితో ఈ కర్తవ్యాన్ని నెరవేర్చాలని నా సంకల్పం. ఈ పని చేస్తుండగా నేను టీచర్నిగాను. ఎన్యూమరేటర్ని.! నాహోదా పెరిగింది. ఈ డ్యూటీలో నేను వ్యవహరించ వలసింది (వేలెడంతలేని కుర్రకుంకలతోగాదు. చెట్టంత మనుషులతో! ఇందులోని నా కార్యరంగం నాలుగు గోడల ఇరుకు గదికాదు.మేడలు.వీధులు, వాడలు. ఎంచక్కా దర్జాగా ఇంటింటికీ వెళ్తాం. ఈ ఇంటి యజమాని ఎవరు అని ధీమాగా ప్రశ్నిస్తాం. ఈ లోగిట్లో ఎన్ని కాపురాలు అంటాం. మీ పేరేమిటి? వయస్సెంత? పుట్టిన ఊరేది? ఇంతకు మునుపు ఎక్కడున్నారు? ఈ ఊరెప్పుడొచ్చారు? చదువొచ్చా. ఎందాకా చదివారు? ఏం చేస్తారు?... ఇలా నా అంబుల పొదిలో ఎడతెగని ప్రశ్నల పరంపర! గ్రామ పౌరులారా? బహుపరాక్! బహుపరాక్! రాజు వెడలె రవితేజ మన్నట్లుగా బయలుదేర బోతున్నారు. ఎన్యూమ రేటరు!

ఎక్కడనుంచి బయలుదేరాలో, ఏ వైపుగా వెళ్ళాలో, ఎక్కడెక్కడ మలుపులు తిరగాలో నిర్దేశించే గ్రామ పటాల్ని సంచిలో పెట్టుకొని నివాస గృహాలేవో, కానివేవో తెలియజేసే ఇండ్ల జాబితా పట్టీని చేత పట్టుకుని, వ్యక్తి చీటీపుస్తకాన్ని చంకన పెట్టుకుని, జేబులో కలం వుందో లేదో చూసుకుని జైత్రయాత్రకు బయలు దేరుతున్న వీరుడిలా వీధిలో

కాలుపెట్టాను. అయ్యవారేదో వేరే పనిమీద వెళ్తున్నట్టుంది. అంటూ గుసగుసలు పోతున్నారు పురజనులు. అన్నట్టు మా ఊరును గ్రామమనుకోడానికి ససేమిరా సమ్మతించను. అయిదువేల జనాభాతో పది పదిహేను వీధులలో, పొడుగాటి బజారుతో, టీ అంగళ్ళతో, సినిమా హెంటుతో సర్వాంగ సుందరంగా ఒక చిన్న మోడల్ నగరంలా ఒప్పారే ఊరు గదండీ! తూరుపు దిశలో మా ఊరి కంచుగా ఓ పనుంది. నా ఇండ్ల జాబితాలోని ఒకటో నంబరు ఇల్లు ఆవలి గట్టున్నేవుంది. అక్కడ నుంచి మొదలు పెట్టి ఏటిగట్టు వీధిలోకి ఏడెనిమిది ఇళ్ళు పూర్తి చేసే సరికి ప్రొద్దు పడమటికి తిరిగింది. పేళ్ళళ్ళ బంగారంగానూ అడిగిన ప్రశ్నలకు సజాయుగా సమాధానం చెప్పరే! మీ పేరేమిటి అంటే— మా అయ్య పెట్టిన పేరా. మా అమ్మ పెట్టిన పేరా అంటారు. వయసెంత 'అంటే ఎంతో ఎక్కడ' గంజి కరువొచ్చినప్పుడు పైట లేస్తున్నాను అంటారు. పెళ్ళయిందా అంటే చూస్తే తెలియడం లేదా అని రెట్టిస్తారు. పుట్టిన ఊరు చెప్పమంటే తెలుసుకొచ్చి చెబుతామనిత్వరున లోపలికి పరుగు దీస్తారు. ఏమిటో అనుకున్నానుగానీ ఇదేమంత అల్లాటప్పా వ్యవహారం గాదు. దిగిన తరువాత లోతు తెలిసింది.


ఏటిగట్టు వీధికి ఆ చివరినుంచి ఉత్తర దక్షిణాలుగా కాలువ తట్టుగుందని ఇంకొకటి ఆ సందులో వున్నవల్లా ఎంచినట్టుగా అయిది ఇళ్ళమాత్రమే. పనిలో పనిగా వీటి పనిగూడా చూచుకుని వెళితే మళ్ళీ ఇటువైపు రావలసిన అవసరం ఉండదు. భోజనానికి కొంచెం ఆలస్యమైనా సరే ఆ ఇళ్ళను గూడా ముగించుకుని వెళ్ళాలన్నది నా ప్రయత్నం. ముందుకు సాగబోతూ ఇండ్ల జాబితానుపరామర్శించాను. నిజం చెప్పొద్దూ నాకు అమితానందం కలిగింది. కాలవతట్టు వీధిలో మొదటిఇంటి కెదురుగా (ఖాళీ) అని వ్రాయబడి వుండడమే అందుకు కారణం. అబ్బో హోదాలోమార్పొచ్చేసరికి నా బుద్ధిలో గూడా మార్పొచ్చింది. క్లాసునిండా కుర్రాళ్ళుంటేనే నాకు ఆనందం. అలాంటిది ఎన్యూమరేటరుపై పొల్లుపోకుండా మనుషుల వివరాలన్నింటినీచిట్టాలోకి ఎక్కించవలసి వచ్చేసరికి ఖాళీ ఇల్లు కనిపిస్తే ఎంత బాగుండునురాబాబో అనిపిస్తుంది,

మొదటి ఇంటిని దాటుకుని బిరబిరా రెండవ ఇంటివైపు వెళ్ళబోతుండగా వెనుక నుంచి పిలుపు వినిపించింది. "అదేమిటండీ అయ్యగారూ! ఎలాగయినా మంచివారే! ఓ ఇల్లు లెక్కలోకి తీసుకోకుండానే వెళ్ళిపోతున్నారే!"

తిరిగి చూచాను జంట కవుల్లాగా ఒకరికిద్దరు నడివయస్సు ముత్తయిదువులు కనిపించారు. రెండో ఆవిడ అందుకుంది. "కోదండంగార్ని ఎరుగరూ! బిల్ కలెక్టరు. ఆయనుండడం ఈ ఇంటోనే!"

"అలాగే! అంటూ రెండడుగులు వెనక్కువేసి ఈ మధ్య ఎవ్వడో వచ్చి చేరినట్టున్నారు. పరవాలేదులెండి. వ్రాసుకుంటాను" అంటూ ఖాళీ అన్న పదాన్ని కొట్టేసి, మిగిలిన ఖాళీజాగాలో కోదండం గారి పేరు ఇరికించాను. ఇంటి యజమాని పేరు వ్రాసిన తరువాత ఆ ఇంట్లో ఎందరున్నారో ఉదహరించాలి. అందుకని "మొత్తం ఎందరున్నారండీ ఈ కుటుంబంలో" అని ప్రశ్నించాలి.

"ఏమిటే కామాక్షీ! ఎందరున్నారో చెప్పలేవూ!" అంటూ విసురుగా "ఉండుండు. నీకు మాత్రం ఎలా తెలుస్తుంది? నేను చెబుతానుండు." అంటూ లావుపాటావిడ వ్రేళ్ళపైన




లెక్కపెట్ట సాగింది— హైస్కూలు వెళ్ళే వాళ్ళిద్దరు, చిన్న బడికెళ్ళి వచ్చే వాళ్ళు ముగురు. ఆ మధ్య అదేదో ఊరికి వెళ్ళి తిరిగొచ్చి తల్లి దబ్బివ్వ లేదని కుండలుబ్రద్దలు చేసిన వాడొకడు. బోడితల పిలకొకటి, చంటిపిల్లవాడొకడు..."

సుడిగాలిలా ఆ లావుపాటావిడ కడుతగిలింది కామాక్షి. "అదేమిటమ్మా రాధమ్మక్కా! పోయినవారం గంగ జాతర వేషాలొచ్చిన నాడు సుబ్బరంగా ఈ మురికి కాలవలో మునిగి లేచిన వాడి మాటేమిటి?

ఎలాగైనా ఈ మొదటి ఊపులోనే ఈ కాలవతట్టు సందునుగూడా పూర్తి చేసేయాలన్న నా ఉత్సాహం అడుగంటి పోయింది. ఇసూరుమంటూ గేటు దాటుకుని మెట్లెక్కి ఎత్తయిన వసారాలో అడుగుపెడుతూ ఓరవాకిలిగా మూసివున్న తలుపు సందుగుండా లోపలికి చూస్తూ "ఏమండీ! ఎవరున్నారు యింట్లో?" పిలిచిఅని చూచాను.

'ఆయనలేర'న్న జవాబు తుపాకీ గుండులా బయటకి దూసుకొచ్చింది.

"ఆయనే వుండితీరాలనేమీ లేదండీ! వివరాలు మీరు చెప్పినా చాలు"! అంటూ అరుగుపైన కూర్చున్నాను.

"అయ్యా! మీకేవివరాలు కావల్సివచ్చినా ఆయన్నే అడిగి తెలుసుకోవాలి. నాకేం తెలియదు. వెళ్ళండి, మళ్ళీ ఎప్పుడైనా రండి" ఆ ఇల్లాలు పుల్లవిరిచినట్టుగా బదులుచెప్పింది.

ఆమాత్రం భంగపాటుకే ఎన్యూమరేటరు నీళ్ళగారిపోవడానికి వీల్లేదని నాకు తెలుసు. అందుచేత కాస్త తమాయించుకొని నింపాదిగా నేనువెళ్ళిన పనెలాంటిదో వివరించాను—

"అమ్మా! మీరలా అనగూడదు. ఇది దేశశ్రేయస్సుతో ముడిబడివున్న తతంగం. మన దేశంలో కొండలున్నాయి. నదులున్నాయి. అడవులున్నాయి. మైదానాలున్నాయి. కాని అన్నింటికన్నా మించినవారు మనుషులు. దేశంలో ఎందరు మనుషులున్నారో తెలిస్తేగానీ వాళ్ళ అవసరాలేపాటివో మనం ఊహించలేము. అందుకని పదేళ్ళ కొకసారి సర్కారువాళ్ళిలా జనాభా వివరాలు సేకరిస్తారు. మనమందరమూ ఇందుకు తోడ్పడాలి. ఇది ప్రజల ధర్మం..."

మూసివున్న తలుపులో కదలిక లేదు. పెరట్లో పిల లగోల ఒకటితప్పితే అసలిప్పుడు హాల్లో మనిషి మసలుతున్న జాడే తెలియరావడంలేదు. నా కర్తవ్యబోధ అరణ్య రోదనమై పోయినందుకు మనస్సు చివుక్కుమంది. ఇస్సురని నిట్టూర్పు విడుస్తూ లేచి గేటుదాకా వచ్చేశాను.

"ఏమిటండి మేష్టరుగారూ! ఓహో, జనాభా లెక్కలుగదూ. అరెరె మాయిల్లు పూర్తిచేసేశారా?" అంటూ ఎదురయ్యాడు కోదండం.

"అబ్బే లేదండీ. మీరింట్లో వుంటేనేగానీ నాపని తెమిలేటట్టు లేదు" అన్నాను.

"అవునవును. అదంతేలెండి." అంటూ అప్పటికదంతా తన ప్రయోజకత్వమే అయినట్టు గొల్లున నవ్వేశాడు కోదండం..." వచ్చేశాను గదండీ వ్రాసుకుందురుగానీ రండి" అంటూ నన్ను ముగ్గులోకి దింపాడు.

కోదండం కంప్యూటర్ యంత్రంలా నేను కోరిన వర్తమానాలన్నీ సరఫరా చేశాడు. అతడంతవేగంగా చెప్పినా, నేనెంత తొందరగా వ్రాసుకున్నా అతడి దగ్గిరనుంచి సెలవు తీసుకోడానికొక గంటసేపు పట్టింది. కోదండం పుట్టింది పెదగోర్పాడు. ఉద్యోగం చేసినవూళ్ళు పదకొండు. ఏబిడ్డ ఏవూళ్ళో

పుట్టిందీ అతడికి నికరంగా జ్ఞాపకంలేదు. మొదటి ఇద్దరు ముగ్గురు బిడ్డల విషయంలో మాత్రమే భార్యాభర్తలకిద్దరికీ ఏకాభిప్రాయం కుదిరింది. బిడ్డలసంఖ్య అయిదు దాటేసరికి మిగిలినవాళ్ళంతా తన సంతానం కానట్టు, వాళ్ళ అస్తిత్వానికీ తనకూ సంబంధంలేనట్టు కోదండం నిష్కామయోగం అవలంబించాడు. ఆరోకానుపులో ఒకబిడ్డ పుట్టేసరికి దాన్ని తీసుకెళ్ళి పెంటకుప్పలో పారేయ్యమన్నాడట కోదండం! అందువల్ల ఆ పిల్ల కుప్పాబిరుదు రాలెంది. ఏడోకానుపుగూడా మళ్ళీ అందుకు డిటో అయ్యేసరికి నిరాశోపహతుడైపోయి 'చాలు, చాలు' అంటూ గావుకేకలు పెట్టాడట కోదండం. అందువల్ల ఆ పిల్ల సాలమ్మనా బరగింది. అప్పటికి వాళ్లే నయం. చివరి ఇద్దరు పిల్లలకూ నిర్దిష్టమయిన నామధేయాలంటూ లేవు. బోడిపిల్లగా, చంటివెధవగా వాళ్ళు వ్యవహృతులు.

ఓ యజ్ఞాన్ని పరిపూర్తిగావించినట్టు చివరికి వచ్చేసరికి నాలోనూ ఓపిక పూర్తిగా నశించింది. "కోదండంగారూ! ఉంటే మంచి నీళ్ళిప్పిస్తారా?" అన్నాను.

ఓదార్చినట్టుగా 'అయ్యో నీళ్ళకేంభాగ్యం' అంటూ నాకు భరోసాయిచ్చి లోపలికి చూస్తూ భార్యకు హుకూం జారీచేశాడు కోదండం.

కొద్దినిమిషాల్లో ఓ నీళ్ళగ్లాసు, దాని వెన్నంటి ఓ గాజులచెయ్యి మెల్లగా ఈవలికి వచ్చాయి. తలుపు సందుల్లోనుండి కోదండం భార్య నాకు పాక్షికంగా మాత్రమే కనిపించింది. చివాలున పైకి లేవబోయినవాణ్ణి, వెన్నుపాముగుండా మెరుపుతీగ ప్రాకినట్టయి అలాగే కూర్చుండిపోయాను. జనాభాలెక్కలు పూర్తి చేయవలసివున్న ఈ పదిహేనురోజుల్లో నేను మళ్ళీ ఒకసారి ఇక్కడికి రాక తప్పదు.

మూడుచేపల కథలోని దూరదర్శిని మార్గదర్శిగా స్వీకరించి నేనొకవ్యక్తి చీటీని ఖాళీగా వదిలి పెట్టేశాను. 'అనతికాలంలో మళ్ళీ మీ దర్శనం చేసుకుంటానండీ మేష్టారుగారూ!' అనిచెప్పి తోటకూరకాడలా ఊగిపోతూ ఇంటి దారి పట్టాను.

* * * *

జనాభా పరిగణకు, రేపటిదినం చివరి రోజనగా ఈనాటి వుదయం పదిగంటలప్పుడు నేను లేని ఉత్సాహాన్ని తెచ్చిపెట్టుకుని కోదండంగారి యింటికి దయచేశాను. గోడకు తలానించి కాళ్ళుబారగల వాపుకుని కోదండం ఏదో ధ్యానసమాధిలో తలమునకలైనట్టున్నాడు.

"కోదండండగారూ!" అన్నాను. కళ్ళు తెరిచాడు, పురుటివాసనలు వెలుపలికి వస్తున్నాయి గనుక ప్రసవాన్నిగురించి వాకబు చేయవలసిన అవసరం లేకపోయింది. "ఏం బిడ్డో చెబుతే వ్రాసుకుంటాను" అన్నాను. కోదండం నావైపు పిచ్చిచూపులు చూశాడు. "ఓడ్డేం కర్మండీ మేష్టారూ బిడ్డలు అనాలి! వ్రాసుకుని వెళ్ళండి. ఇద్దరూ ఆడబిడ్డలే!"

నా పాదాలక్రింద భూకంపం బయల్దేరినట్టయింది. కాళ్ళు గడగడా వణికిపోతున్నట్టయి నన్ను నేను నిలువరించుకోలేకపోయాను. నా దగ్గరుండిన వ్యక్తిచీటీల పుస్తకాలన్నీ పూర్తయిపోయాయి. ఇక తెప్పించుకోవాలన్నా వ్యవధిలేదు. కోదండంగారి పదో సంతానం తాలూకు కవలబిడ్డల్లో రెండోబిడ్డను లెక్క లెక్కించడానికి నా పుస్తకంలో ఖాళీ లేదు.

Grams : PICASSO
Telex : 049 – 252

Phones : 5523 & 5225

*With the best Compliments from :*

**Coromandel Paints & Chemicals Ltd.,**

**10-1-20 Waltair Uplands**
**VISAKHAPATNAM – 530 003.**

***Factory at :***
**PENDURTY**
**Grams : PICASSO – Phone : 63 & 54**

***Manufacturers of :***

**All varieties of Varnishes and Paints-**
**Decorative, Industrial & Marine Paints**
**including highly sophisticated coatings.**